ఐదేళ్ల నాటి సైబర్ కేసు

సుఖాంతం

బాధితుడికి రూ.18.29 లక్షలు అప్పగించిన రాయచూరు పోలీసులు

9

అనుమతి లేని గ్రానైట్ లారీ స్వాధీనం

● పరారీలో డ్రైవర్లు



ఎవ్వరినీ వదలరు..!

● విదేశాలనూ వదలని సైబర్ నేరగాళ్లు
● డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు
● బీపీఓ కంపెనీ అంటూ కాల్ సెంటర్
● 16 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు విదేశాలను సైతం వదల్లేదు. ఏకంగా అమెరికా తదితర దేశాలకు ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బులు గుంజేశారు. సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించినా నేరాలు మాత్రం తగ్గడం లేదు. బెంగళూరులో నకిలీ బీపీఓ కంపెనీ ప్రారంభించి పోలీసుల తరహాలో మోసాలకు పాల్పడుతున్న ముఠాను సోమవారం అరెస్టు చేశారు. అమెరికాతోపాటు వివిధ దేశాల ప్రజలకు ఫోన్ చేసి మీపై కేసులు ఉన్నాయని, డిజిటల్ అరెస్టు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడిన ముఠాను హెచ్ఎస్ఆర్ లే అవుట్ పోలీసులు గుర్తించారు. 27వ మెయిన్‌రోడ్డులో నకిలీ బీపీఓను తెరిచి మోసాలకు పాల్పడే కంపెనీని గుర్తించిన ఇన్‌స్పెక్టర్ హరీశ్‌కుమార్ సుమోటోగా కేసు నమోదు చేశారు. దాడి చేసి 16మందిని అరెస్టు చేశారు. 40కుపైగా కంప్యూటర్లతోపాటు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సిబిట్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రెండేళ్లుగా కంపెనీ ముసుగులో మోసాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. రెండు అంతస్తులలో కేవలం 20-25 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో డ్యూటీ అంటూ ఉద్యోగులను రిక్రూట్‌మెంట్, శిక్షణ పేరిట మోసం చేశారు. రాత్రివేళల్లో అమెరికాకు చెందిన ఫోన్ నెంబర్లకు వాట్సప్‌కాల్ ద్వారా ఫోన్ చేసి నకిలీ అరెస్టు వారెంట్, నకిలీ పోలీస్ ఐడీలు చూపి బెదిరింపులకు పాల్పడేవారని గుర్తించారు. పట్టుబడినవారిలో మహారాష్ట్రకు చెందిన 8మంది, మేఘాలయకు చెందిన నలుగురు, ఒడిశ్శా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, గుజరాత్‌లకు చెందినవారు ఒక్కొక్కరు ఉన్నారు.

కార్కళ మాజీ ఎమ్మెల్యే కుమారుడి ఆత్మహత్య

7

తండ్రి మందలించాడని కళాశాల భవనంపై నుంచి దూకి విద్యార్థి బలవన్మరణం

అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్

మంత్రులతో సమావేశంలో సీఎం సిద్దరామయ్య

ఏ పదవి అప్పగించినా బాధ్యతగా పని చేయాలని సూచన

[illegible]

[illegible]



మంత్రులతో సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేబినెట్‌లో మార్పులపై రాష్ట్రంలో ఎవ్వరూ నిర్ణయం తీసుకోరని ఇందులో అధిష్ఠానమే ఫైనల్ అని సీఎం సిద్దరామయ్య మంత్రులతో అన్నారు. ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా పని చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన సమీపిస్తున్న తరుణంలో సీఎం సిద్దరామయ్య సోమవారం రాత్రి మంత్రులకు ప్రత్యేక విందు ఇచ్చిన సంగతి తెలిసిందే. సాధారణంగా శాసనసభ సమావేశాలు, లేదా లెజిస్లేచర్ భేటీ అంతకుమించి ఇతరప్రాంతాల్లో కేబినెట్ సమావేశాలు నిర్వహించే సమయంలో మాత్రమే ముఖ్యమంత్రి విందు ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఎలాంటి ప్రత్యేకత లేకున్నా కేవలం మంత్రులకు మాత్రమే విందు ఇవ్వడం రాజకీయంగా తీవ్రమైన చర్చకు కారణమైన విషయం తెలిసిందే. అధికారిక నివాసం కావేరిలోనే సీఎం విందు ఏర్పాటు చేయగా మంత్రులందరూ పాల్గొన్నారు. ఇదే సందర్భంలోనే ముఖ్యమంత్రి సూటిగానే పలు అంశాలను తెలిపారు. అధిష్ఠానం కేబినెట్ విస్తరణ చేసేందుకు సిద్ధమవుతోందని సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి కేబినెట్‌నుంచి ఎవరిని తొలగించినా తనకేం సంబంధం లేదని ముందస్తుగానే హెచ్చరించినట్టుగా ఉంది. మరోవైపు పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా అందుకు సంసిద్ధం కావాలని సూచించినట్లు తెలుస్తోంది. విందు ప్రారంభంలో ఉత్సాహంగా కనిపించిన కొందరు మంత్రులు ఆ తర్వాత కాస్త నిరాశకు లోనైనట్లు తెలుస్తోంది. మంత్రులూ మీ పరిధిలో అభివృద్ధి, రాజకీయాల్లో వేగం పెంచాలని ఏడాది పొడవునా ఎన్నికలు ఉంటాయని సీఎం సూచించారు.

డీసీఎం డీకే శివకుమార్ దాదాపు గంటకుపైగా గడిపి విందు ముగించుకుని వెళ్లాక మరింత కీలకమైన చర్చలు జరిపినట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్‌పై మంత్రి ప్రియాంకఖర్గే వ్యాఖ్యలకు పలువురు మంత్రులు మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. తమిళనాడు తరహాలో ఆర్ఎస్ఎస్‌ను కట్టడి చేయాలనే అంశంపై ఒకరిద్దరు ఆవేశంగా మాట్లాడినా ఆచితూచి వ్యవహరించాలని కొందరు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. నియోజకవర్గాలకు కేటాయించిన రూ.50 కోట్ల గ్రాంటు సమగ్రంగా ఖర్చు చేసే అంశం కూడా కీలకమే అని సూచించినట్లు సమాచారం. గ్యారెంటీలను విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించినట్టు తెలుస్తోంది. మొత్తంగా సీఎం ఏర్పాటు చేసిన విందులో కీలకమైన అంశాలే ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. నవంబరు ఆఖరు లేదా డిసెంబరు మొదటి వారంలో జరిగే విస్తరణలో ఏమేరన ప్రక్షాళన జరుగుతుందనేది కీలకం కానుంది. సీఎం సిద్దరామయ్య సోమవారం బాగల్కోటె జిల్లాలో మీడియాతో మాట్లాడిన వేళ కేవలం అధిష్ఠానం ఆశీస్సులే కాదని, ఎమ్మెల్యేల మద్దతు ముఖ్యమని అప్పుడే ముఖ్యమంత్రికి అవకాశమని తెలిపారు. అందుకు ధీటుగానే డీసీఎం డీకే శివకుమార్ ఎమ్మెల్యేల మద్దతు ఒక్కటే కీలకం కాదని అధిష్ఠానం ఆదేశాలు కూడా అవసరంగా ఉంటాయన్నారు. దీన్నిబట్టి ఇద్దరూ భిన్నాభిప్రాయాలతోనే ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి నాయకత్వ మార్పు అనే అంశం తొలగిపోలేదని, అవకాశమే ముఖ్యమని అందుకోసం వేచి చూస్తున్నామని ఇద్దరూ అభిప్రాయపడినట్టుగా ఉంది. అయితే వివరాలు ఎవరూ బయటికి చెప్పడం లేదు.

బెదిరింపులు కొత్త కాదు

● ఆర్ఎస్ఎస్‌పై పోరాటమేనన్న ప్రియాంక ఖర్గే
● కర్రలతో తిరిగితే వదిలేయాలా..?
● అంబేడ్కర్ వాదులమంతా నీలం చొక్కాలతో గుంపు కడతామంటూ హెచ్చరిక



బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్‌కు సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలపై బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ఇవి తమ కుటుంబానికి కొత్తవి కాదని, తన పోరాటాన్ని ఆపేది లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు, కర్ణాటక ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే అన్నారు. మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన గత ప్రభుత్వంలోనూ మా ధ్వని వినిపించినప్పుడు బెదిరింపు కాల్స్ వచ్చాయన్నారు. నా తండ్రి మల్లికార్జున ఖర్గేకు ల్యాండ్‌లైన్‌కు ఫోన్ చేసి పలుమార్లు బెదరించారన్నారు. ఇప్పటికీ సఫ్దర్‌జంగ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కొనసాగుతోందన్నారు. బెంగళూరు సదాశివనగర్ ఇంటి ల్యాండ్‌లైన్‌కు పలుమార్లు ఫోన్ వచ్చిందన్నారు. ఇటువంటి బెదరింపు కాల్స్‌కు భయపడేది లేదన్నారు. తనకు మాత్రం నిరంతరంగా వాట్సప్‌కాల్స్, హెచ్చరికలు వస్తూనే ఉంటాయన్నారు. ఎఫ్ఐఆర్ నమోదుకు అవకాశం ఉన్నా ఇవి ఎన్‌క్రిప్టెడ్ కాల్ కావడంతో ఎక్కడనుంచి వచ్చాయనేది గుర్తించడం కష్టతరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భయపడలేదని అధికారంలో ఉన్నప్పుడు వెనకడుగు వేయడం ఎందుకన్నారు. ఆర్ఎస్ఎస్ కొన్ని సంఘాలు తత్వసిద్ధాంతాల గురించి మండిపడ్డారు. నూరేళ్లకిందటే ఇలాంటి బెదిరింపులు ఉన్నాయన్నారు. మహాత్మాగాంధీని బలిగొన్నారని, అంబేడ్కర్‌ను ముగించేందుకు ప్రయత్నించారన్నారు. ఆర్ఎస్ఎస్‌కు వందేళ్ల చరిత్ర ఉంటే కాంగ్రెస్ 135 ఏళ్ల చరిత్ర కల్గిన పార్టీ అన్నారు. తాను ఒంటరి కాదని, సిద్ధాంతాల ఆధారంగా ఉంటాయన్నారు. బుద్ధ, బసవ, అంబేడ్కర్ సిద్ధాంతాలు పాటిస్తామని, రాజ్యాంగంపై అపార నమ్మకం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ తత్వ సిద్ధాంతాలలో అందరికీ అవకాశం లేదన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏ కార్యక్రమం జరపాలన్నా అనుమతులు అవసరమని, ఏ పార్టీకైనా ఈ నిబంధన ఉంటుందన్నారు. పదిమంది కర్రలు పట్టుకుని రోడ్డెక్కుతామంటే అనుమతులు ఉండాలన్నారు. కర్రలు తిప్పుతూ వస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉండాలా... అన్నారు. తాను పిలుపునిచ్చి అంబేడ్కర్ వాదులంతా నీలం చొక్కాలతో కర్రలు పట్టుకుని ఊరేగుతామంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా..? అంటూ ప్రశ్నించారు. వారికెందుకు మినహాయింపు అని ప్రశ్నించారు. కొన్ని పోరాటాలు సమైక్యంగా చేయాల్సి ఉంటుందని, మరికొన్ని ఒంటరిగా చేయాల్సి ఉంటుందన్నారు. కర్ణాటక ఉనికిని కాపాడుకునే విషయంలో అందరూ ఒక్కటి కావాలన్నారు. నా వ్యాఖ్యల తర్వాత సీఎం, డీసీఎం, మంత్రులు సంతోష్‌లాడ్, దినేశ్ గుండూరావు మాట్లాడారన్నారు. పోరాటం తమ హక్కు అన్నారు.



నేడు హంపికి నిర్మలా సీతారామన్

● విరూపాక్షేశ్వరుడిని దర్శించుకోనున్న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి

బళ్లారి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. విజయనగర, కొప్పళ బళ్లారి జిల్లాలో నాలుగురోజుల పాటు పర్యటించనున్నట్లు రాష్ట్ర సమాచార శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి నిర్మలా సీతారామన్ హంపి చేరుకుని జంగిల్ లాడ్జ్ రిసార్టులో బస చేయనున్నారు. బుధవారం ఉదయం విరూపాక్షేశ్వరుడిని దర్శించుకోనున్నారు. అనంతరం కొప్పళ జిల్లా మోత్కల్ గ్రామం లో పర్యటిస్తారు. మధ్యాహ్నం తిరిగి హంపి చేరుకుని హొస్పేట్ లోని హోటల్ మల్లిగా లో నిర్వహించే సదస్సులో పీఎంఐఎస్ ఇంటర్ నెట్ ద్వారా మాట్లాడుతారు. శుక్రవారం బళ్లారి నుంచి కూడ్లిగి తాలూకా లోని కసాపుర గ్రామంలో రైతులకు నిర్వహించే శిక్షణ కేంద్ర, ప్రాసగింగ్ యూనిట్ ను ప్రారంభిస్తారు. ఆదే రోజు కూడ్లిగి నుంచి బెంగళూరుకు రోడ్డు మార్గంలో చేరుకోనున్నట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా లోకాయుక్త మెరుపుదాడులు

● పలుశాఖల్లో ఉన్నతాధికారులపై కొరడా
● భారీగా నగదు, బంగారం స్వాధీనం

బెంగళూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బెంగళూరుతోపాటు 12 మంది అధికారులపై లోకాయుక్త బృందాలు దాడులు జరిపాయి మంగళవారం ఉదయం లోకాయుక్త అవినీతి అధికారులకు షాక్ ఇచ్చింది. బెంగళూరులో విద్యాశాఖ డైరెక్టర్ వీ సుమంగళ, బీఎంఆర్‌సీఎల్ భూస్వాధీన అధికారి ఎన్‌కే గంగమరి, మల్లసంద్ర కాన్పుల ఆసుపత్రి వైద్యాధికారి మంజునాథ్ హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్, సవణూరు తాలూకా పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బసవేశ్, బాగల్కోటె జిల్లా ఆల్మట్టి కుడికాలువ జూనియర్ ఇంజనీర్ చేతన్, దావణగెరె జిల్లా పౌర ఆహార సరఫరాలశాఖ జూనియర్ ఇంజనీర్ బీఎస్ నడవిన మనె, ఇదే జిల్లాకు చెందిన గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్ నాయక్, హాసన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సీనియర్ అసిస్టెంట్ జ్యోతినేరి, కలబురగి జిల్లా వ్యవసాయశాఖ ఏడీ ధూళప్ప, చిత్రదుర్గ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రకుమార్, ఉడుపి జిల్లా ఆర్టీఓ లక్ష్మీనారాయణ్ పి నాయక్‌ల నివాసాలపై దాడులు జరిపారు. భారీగా ఆస్తులు, నగదు స్వాధీనం చేసుకున్నట్టు లోకాయుక్త ప్రకటించింది.





ఇంటి ముందు చెత్త పడేసిన నగరసభ సిబ్బంది

చెత్తతోనే సమాధానం

● వారిస్తున్నా వీధిలోనే చెత్త వేసిన నగరవాసి
● టిప్పర్‌తో ఇంటి ముందు చెత్త వేసి పౌరకార్మికుల నిరసన
● పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు: నగరసభ కమిషనర్

చింతామణి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చెత్త వివాదం ఏకంగా కమిషనర్‌నే రప్పించింది. వీధుల్లో చెత్త పడేస్తుంటే వారించినా వినకపోవడంతో నగరసభ సిబ్బంది ఏకంగా టిప్పర్‌తో ఇంటి ముందు చెత్త పడేసి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. అయినా కొన్నిచోట్ల ఇష్టం వచ్చినట్టు చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. మంగళవారం నెక్కుందిపేట లే అవుట్ అయ్యప్పస్వామి ఆలయ రోడ్డు నివాసి ఒకరు వీధిలో చెత్త పడేయడాన్ని నగరసభ కమ్యూనిటీ వర్కర్‌గా ఉన్న మహిళా సిబ్బంది గుర్తించారు. అతడికి ఆమె బుద్ధి మాటలు చెప్పినా పట్టించుకోకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించి అవహేళనగా మాట్లాడారు. దీంతో మహిళా సిబ్బంది నగరసభ అధికారులకు సమాచారం ఇచ్చారు. నగరసభ కమిషనర్ చలపతి నేతృత్వంలో అధికారులు, సిబ్బందికి అక్కడికి చేరుకున్నారు. వీధిలోకి చెత్త వేసిన వ్యక్తి ఇంటి ముందు టిప్పర్‌తో చెత్త వేసి నిరసన తెలిపారు. ఇంటి ముంగిటకే వచ్చే చెత్త సేకరణ వాహనంలోనే చెత్తను పడేయాలని అధికారులు సూచించారు. పట్టణంలో ఇష్టం వచ్చినట్టు చెత్తను వేస్తే కఠిన చర్యలు తప్పవని నగరసభ కమిషనర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నగరసభ కమిషనర్ హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న పౌరకార్మికులు, సిబ్బంది

సైన్స్ చదివి మూఢనమ్మకాలు పాటించడమా..?

● అలా చేస్తే విద్య, ప్రతిభకు అర్థం లేదు ● విద్యార్థులు ప్రయోగాలపై దృష్టి పెట్టాలి ● ముఖ్యమంత్రి సిద్దరామయ్య



భవనం ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య, యూనివర్సిటీ అధికారులు



నృపతుంగ యూనివర్సిటీలో నూతన భవనం

బెంగళూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్య, ప్రతిభ అనేవి ఎవరి సొత్తు కాదని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకెళ్లాలని, సైన్స్ చదివి మూఢనమ్మకాలపట్ల విశ్వాసం చూపితే మీరు చదివింది వృథా అయినట్లేనని సీఎం సిద్దరామయ్య అన్నారు. నృపతుంగ యూనివర్సిటీలో రూసా పథకం కింద నిర్మించిన భవనాలను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ రామాయణాన్ని రచించిన వాల్మీకి బేడర కులానికి చెందినవారని, మహాభారతాన్ని రచించిన వ్యాసుడు బెస్త సముదాయానికి చెందినవారని దీన్నిబట్టి ప్రతిభ అనేది ఎవరి సొత్తు కాదన్నారు. సైన్స్ చదివినవారు అందుకు తగ్గట్టుగా ఆలోచించాలన్నారు. సైన్స్ చదువుతున్నారని కానీ పరిశోధనలు చేసేవారు తక్కువన్నారు. తాను తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు మూఢ నమ్మకాల నిషేధచట్టం తీసుకొచ్చానన్నారు. సాధ్యమైనంత ఉన్నత చదువులు చదివినవారు సమాజంలో మార్పుకు పాటుపడ్డాలన్నారు. దేశ తొలిప్రధాని నెహ్రూ యువత శాస్త్రీయ మనోభావాలు పెంపొందించుకోవాలని ఆలోచించాలన్నారు. రూ.52కోట్లతో నిర్మించిన భవనం సర్వాంగ సుందరంగా ఉందని, చదువుకునేందుకు ఉత్తమ వాతావరణం సాధ్యమైందన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేపట్టాలన్నారు. ఎనిమిదో అంతస్తు నిర్మాణానికి 8 కోట్ల రూపాయలు అవసరమని కోరారని వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఉన్నతవిద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

26న చలో బెంగళూరు

● విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన : విద్యుత్తు వినియోగదారుల సంఘం రాష్ట్రకార్యదర్శి జ్ఞానమూర్తి

9

ఫలించిన జార్కిహోళి బ్రదర్స్ వ్యూహం

● రసవత్తరంగా బెళగావి డీసీసీ బ్యాంకు పోరు.. 9మంది ఏకగ్రీవం ● 7 స్థానాలకు 19న ఎన్నికలు



బెంగళూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జార్కిహోళి బ్రదర్స్ వ్యూహం ఫలించింది. బెళగావి డీసీసీ బ్యాంకు ఎన్నికలపోరు రసవత్తరంగా జరిగింది. 16 డైరెక్టర్ల స్థానాలకు గాను తొమ్మిది స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మరో 7స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరగాల్సి ఉంది. రాష్ట్రమంతటా బెళగావి ఎన్నికలపైనే చర్చ సాగుతోంది. చిక్కోడితాలూకా నుంచి గణేశ్‌హుక్కేరి, గోకాక్ నుంచి అమరనాథ్ జార్కిహోళి, సవదత్తి విరూపాక్ష మామని, ఎర్రగట్టి నుంచి విశ్వాస్‌వైద్యలు ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీటితోపాటు ఎమ్మెల్సీ చన్నరాజ హట్టిహోళి ప్రత్యర్థుల చేత నామినేషన్లు సోమవారం ఉపసంహరింపచేయడంతో ఏకగ్రీవానికి మార్గం సుగగం అయ్యింది. కాగవాడ నుంచి రాజుకాగె, ఖానాపుర నుంచి అరవింద పాటిల్, బెళగావి నుంచి రాహుల్ జార్కిహోళి, మూడలగి నుంచి నీలకంఠ కప్పలగుద్దిల ప్రత్యర్థులు చివరిక్షణంలో నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో ఏకగ్రీవానికి మరింత వీలైంది. ఏకగ్రీవమైన 9 స్థానాలలో 7 బాలచంద్ర జార్కిహోళి ప్యానెల్‌కు చెందినవారు కాగా మరో ఇద్దరు స్వతంత్రులు ఉన్నారు. ఈనెల 19న 7 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా ఉమేశ్‌కత్తి వర్గీయులు మూడు దశాబ్దాలుగా డీసీసీ బ్యాంకు ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. ఈసారి కూడా తమదే గెలుపు అంటూ ఆరంభంలో ధీమా వ్యక్తం చేశారు. అయితే జార్కిహోళి కుటుంబీకులంతా ఒక్కటి కావడంతో భారీగా దెబ్బ పడింది.



మహాసభల చర్చల్లో ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

మరింతగా ఉద్యమించాలి

- ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే
- రెండో రోజు కొనసాగిన రాష్ట్ర మహాసభలు

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల సాధన కోసం మరింతగా ఉద్యమించాల్సిన అవసరముందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు రెండోరోజు మంగళవారం కొనసాగాయి. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి గత మూడేళ్ల నుంచి రాష్ట్రంలో ఐద్వా చేపట్టిన కార్యక్రమాలను మహాసభలో ప్రవేశపెట్టారు. మైక్రో ఫైనాన్స్ ఆగడాలపైన, మహిళలపై జరిగిన హింస పైన చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లాల వారీగా హాజరైన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. వారి జిల్లాల్లో ఐద్వా చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు.

చర్చల్లో పలు సంఘాల నాయకులు

రెండోరోజు చర్చల నేపథ్యంలో సీఐటీయూ, ఏపీ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆవాజ్, కేవీపీఎస్ సంఘాల నాయకులు పాల్గొని సలహాలు, సూచనలు అందించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రాంతాల్లో సరైన భద్రత లేదని, కనీస వేతనాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ అంశాలపై మహిళా సంఘంతోపాటు సీఐటీయూ కలిసి పనిచేస్తుందన్నారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర నాయకురాలు హేమలత మాట్లాడుతూ వ్యవసాయంలో ఎక్కువమంది మహిళలే ఉన్నారని, అందులోనూ ప్రధానంగా పాడిరంగంపై ఆధారపడినది మహిళలేనన్నారు. ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకురాలు రాణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు సరిగ్గా లేకపోవడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప మాట్లాడుతూ దళితులు, మహిళలపైనే దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఐద్వాతో కలిసి పనిచేస్తామన్నారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిస్తి మాట్లాడుతూ ఐద్వా రాష్ట్ర మహాసభల్లో మహిళల సమస్యలపై చర్చించి, పరిష్కారానికి బాటలు వేయాలని ఆకాంక్షించారు.

'ఎక్కడమ్మా నీవు లేనిది' ఆవిష్కరణ



'ఎక్కడమ్మా నీవు లేనిది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఐద్వా రాష్ట్ర మహాసభల నేపథ్యంలో మహిళా సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి కవులు పంపిన కవితలను 'ఎక్కడమ్మా నీవు లేనిది' పేరుతో కవితా సంపుటిగా ముద్రించారు. దీన్ని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ ఆవిష్కరించారు. అంతకుముందు ప్రజానాట్యమండలి కళాకారులు చైతన్య గీతాలు ఆలపిస్తూ అలరించారు. ఈ సందర్భంగా కవితా సంపుటి రూపకర్త ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందని ఏళ్లనాటి కిందటే గురజాడ అప్పారావు చెప్పారని గుర్తు చేశారు. సమ సమాజ స్థాపన, సుస్థిరత సాధించేవరకూ ఐద్వా వంటి సంఘాలు ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఉద్యమాలకు రచయితలు, కవులు, కళాకారులు తమవంతు సహకారమందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి రమావతి, జిల్లా కార్యదర్శి చంద్రిక, కవి ఏలూరి యంగన్న, రచయితలు జూటూరు షరీఫ్, నర్సిరెడ్డి, వర్ధిని, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. నగర శివారులోని ఎంకేఎం ఫంక్షన్‌హాల్ వద్ద మంగళవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలక వర్గాలు మారుతున్నారే తప్ప.. విద్యుత్ కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగించాలన్నారు. విద్యుత్ చార్జీలు పెరుగుతున్నా.. ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. వీటిపై విద్యుత్ పంపిణీ సంస్థలు, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను శాంతియుత వాతావరణంలో పరిష్కరించాలనీ, లేనిపక్షంలో సమ్మె చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందుకు యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్వీ నాయుడు, కోశాధికారి నాగమణి, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, నగర కార్యదర్శి ముత్తుజ, గోపాల్, వెంకటనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెబాట!

- చర్చలు సఫలమైతే విధుల్లోకి..
- లేదంటే నేటి ఉదయం నుంచి సమ్మె



విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం

అనంతపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు సమ్మెబాట పడుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే ప్రభుత్వంతో విద్యుత్తు జేఏసీ నాయకులు చర్చలు జరుపుతున్నారు. అవి పూర్తిస్థాయిలో సఫలం కావడంలేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. మంగళవారం రాత్రి మరో మారు చర్చలు జరపనున్నారు. సఫలమైతే యథాతథంగా ఉద్యోగులు విధులకు హాజరుకానున్నారు. లేదంటే బుధవారం ఉదయం 6 గంటల నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు జిల్లా జేఏసీ నాయకులు చెప్పుకొచ్చారు. వీరి సమ్మెకు పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నారు. ఆ మేరకు సెప్టెంబరు 12న ఉమ్మడి జిల్లాల విద్యుత్ సూపరింటెండెంట్లకు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈక్రమంలోనే రోజువారీ ఆందోళనలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచే ఉద్యోగులు, సిబ్బంది సమ్మెలోకి వెళ్లాల్సి ఉంది. ప్రభుత్వంతో రాష్ట్ర జేఏసీ నాయకులు చర్చలు జరుపుతుండడం, వర్షాలు కురుస్తుండటంతో బుధవారం ఉదయం నుంచి చేపట్టాలని సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఇంజనీర్లు మినహా ఇస్తే అందరూ సమ్మెలోకి వెళ్లనున్నారు. దాదాపు 2వేల మంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేయనున్నారు. దీంతో సంబంధిత అధికారుల్లో ఆందోళనలు మొదలయ్యాయి. ఉద్యోగులు సమ్మెలోకి వెళితే వినియోగదారుల సేవలపై ప్రభావం పడనుంది.

పీఎల్ఐ పాలసీలతో..
గ్రాడ్యుయేట్లకు ధీమా..!

ఆరు ప్లాన్లతో ఆర్థిక ప్రయోజనాలు

తపాలా శాఖ పథకాల విస్తరణ



తపాలా శాఖ పీఎల్ఐ స్కీం వివరాల పోస్టర్

తపాలా శాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ అందించే బీమా పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ధీమానిస్తున్నాయి. పీఎల్ఐ(పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) పేరిట ప్రవేశపెట్టిన పలు రకాల పథకాలు ఎంతో మంది గ్రాడ్యుయేట్లకు ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తున్నాయి. వీటిని మొదట్లో తపాలాశాఖ ఉద్యోగుల సంక్షేమ పథకాలుగా ప్రవేశపెట్టారు. తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, భద్రతా సిబ్బందికి వర్తింపజేశారు. కాలక్రమేణా ఈ పీఎల్ఐ పథకాన్ని వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, సీఏ వంటి ప్రొఫెషనల్స్‌తో పాటు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదైన కంపెనీల ఉద్యోగులకు వర్తింపజేశారు. ఇటీవల గ్రాడ్యుయేట్లకూ ఈ పీఎల్ఐ సౌకర్యాన్ని విస్తరించారు. దీంతో ఈ పథకాలవైపు గ్రాడ్యుయేట్లు ఆసక్తి కనబరుస్తున్నారు

యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అస్యూరెన్స్

దీనిని మనీబ్యాక్ పాలసీ అంటారు. 19-45 సంవత్సరాల మధ్య గలవారు ఈ పాలసీకి అర్హులు. బీమా రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకూ ఉంటుంది. పాలసీ కాలపరిమితి 15 నుంచి 20 సంవత్సరాలుగా నిర్ణయించారు. 15 ఏళ్ల పాలసీపై 6, 9, 12 ఏళ్లు పూర్తయితే 20 శాతం, మెచ్యూరిటీపై 40 శాతం బోనస్ లభిస్తుంది. 20 ఏళ్ల పాలసీపై 8, 12, 16 సంవత్సరాలు పూర్తయితే... 20 శాతం, మెచ్యూరిటీపై 40 శాతం చొప్పున బోనస్ లభిస్తుంది. ఈ స్కీంలో ఉన్న లబ్ధిదారులకు సంవత్సరానికొకసారి రూ. 1000కి రూ. 48 చొప్పున బోనస్ లభిస్తుంది.

హోల్ లైఫ్ అస్యూరెన్స్

ఈ పాలసీకి 19 నుంచి 55 సంవత్సరాల మధ్య గల వారు అర్హులు. బీమా రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకూ ఉంటుంది. ప్రీమియం చెల్లించే వయస్సును 55, 58, 60 సంవత్సరాలుగా ఎంచుకునే అవకాశం కల్పించారు. నాలుగేళ్ల తర్వాత రుణం తీసుకునే వెసులుబాటు ఉంది. మూడేళ్లు దాటితే పాలసీ సరెండర్ చేసుకునే వీలుంటుంది. ఐదేళ్లలోపు సరెండర్ చేస్తే ఎలాంటి బోనస్‌లు వర్తించవు. కోతలు విధిస్తారు. ఏటా ప్రతి రూ. 1000కి రూ. 76 చొప్పున బోనస్ లభిస్తుంది. పాలసీదారుడికి 80 ఏళ్లు దాటినా లేదా మరణించినా.. వారసులకు బీమా సొమ్ము, బోనస్ ప్రయోజనాలను చెల్లిస్తారు.

కన్వర్టబుల్ హోల్ లైఫ్ అస్యూరెన్స్

ఈ పాలసీకి 19 నుంచి 50 సంవత్సరాల వారు అర్హులు. రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకూ బీమా చెల్లింపులు చేయవచ్చు. మూడేళ్లు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం ఉంది. ఐదేళ్లలోపు సరెండర్ చేస్తే బోనస్ రాకపోగా.. కోతలు విధించే నిబంధనలు ఉన్నాయి. ప్రతి ఏటా రూ. 1000కి రూ. 76 చొప్పున బోనస్ లభిస్తుంది.

ఎండోమెంట్ అస్యూరెన్స్

ఈ పాలసీకి 19 నుంచి 55 సంవత్సరాల వారు అర్హులు. కనీస బీమా రూ. 20 వేలు. గరిష్ఠంగా రూ. 50 లక్షలు ఉంటుంది. పాలసీ తీసుకున్న మూడేళ్ల తర్వాత రుణ సదుపాయం, పాలసీ సరెండర్‌కు అవకాశం ఉంటుంది. ఐదేళ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనసుల్లో కోతల విధింపు తప్పదు. ప్రతి ఏటా రూ. 1000కి రూ. 52 చొప్పున బోనస్ లభిస్తుంది.

జాయింట్ లైఫ్ అస్యూరెన్స్

ఈ పాలసీకి 21 నుంచి 45 ఏళ్ల వయస్సు గల దంపతులు అర్హులు. బీమా రూ. 20 వేల నుంచి రూ. 50 లక్షల వరకూ ఉంటుంది. పాలసీ కాలపరిమితి 5 నుంచి 20 ఏళ్లు. పాలసీ తీసుకున్న మూడేళ్ల తర్వాత రుణసదుపాయం ఉంటుంది. ఐదేళ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనసుల్లో కోత ఉంటుంది. పాలసీదారుడి మరణానంతరం ప్రయోజనాలు భాగస్వామి లేదా వారసులకు వర్తిస్తాయి. ప్రతి ఏటా రూ. 1000కి రూ. 52 చొప్పున బోనస్ లభిస్తుంది. సింగిల్ ప్రీమియంతో దంపతులు బీమా కవరేజీని పొడిగించుకోవచ్చు.

చిల్డ్రన్ పాలసీ

పాలసీదారుల పిల్లల కోసమే ఈ పథకాన్ని తీసుకొచ్చారు. గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు బీమా చేసుకోవచ్చు. పిల్లల వయస్సు తప్పనిసరిగా 5 నుంచి 20 ఏళ్లలోపు ఉండాలి. పిల్లలకు గరిష్ఠంగా రూ. 3 లక్షలు లేదా పాలసీదారు బీమా ప్రకారం ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు. పాలసీదారు(పిల్లల తండ్రి) వయస్సు 40 ఏళ్లు దాటి ఉండకూడదు. పాలసీదారు చనిపోతే పిల్లలపై తీసుకున్న బీమాకు ప్రీమియంలు చెల్లించనక్కర్లేదు. కాలపరిమితి తీరాక బీమా సొమ్ము, బోనస్‌లు వర్తిస్తాయి. రుణ సదుపాయం, సరెండర్ సౌకర్యాలు ఈ స్కీంలో ఉండవు. ప్రీమియంలు తల్లిదండ్రులే చెల్లించాలి. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి. వీరికి ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించరు. ఎండోమెంట్ పాలసీ ప్రకారం బోనస్‌లు వర్తిస్తాయి.

దరఖాస్తు చేసేదిలా...

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను తీసుకోవాలనుకునేవారు కావాల్సిన పత్రాలను విధిగా సంబంధిత అధికారులకు సమర్పించాలి. గ్రాడ్యుయేట్లు పదో తరగతి, డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. పాలసీని బట్టి వివిధ వైద్య పరీక్షలు ఉంటాయి. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు పోస్ట్ ఇన్ఫో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదా సమీప పోస్టాఫీసును సంప్రదించి స్కీంలో భాగస్వాములు కావచ్చు.

మరిన్ని వివరాలకు www.indiapost.gov.in లాగిన్‌లో సంప్రదించి తెలుసుకునే అవకాశం కల్పించారు.

టీడీపీ జోలికొస్తే తొక్కేస్తాం

- తోపుదుర్తికి ఎమ్మెల్యే కందికుంట వార్నింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట

కదిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ జోలికొస్తే పాతాళానికి తొక్కేస్తామని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకాశ్‌రెడ్డి రాజకీయ పరిజ్ఞానం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన పేరు ప్రకాష్ రెడ్డి కాదని.. ఫ్రోక్యాష్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కదిరిలో అవినీతికి తావులేదని, రాజకీయ నాయకులు తప్పుచేస్తే ఐదేళ్లకే వారికి ప్రజలు సమాధానం చెబుతారని అన్నారు. చారుమజుందార్ సమకాలికుడు ఎస్ఏ రఫూఫ్ పుట్టిన ప్రాంతం ఇది అని అన్నారు. కదిరి ప్రజలు సేవ చేస్తే ఆదరిస్తారని, అందుకే తానే నిదర్శనమని అన్నారు. తమకు హౌసింగ్ స్కామ్ గురించి తెలియదని అన్నారు. 'మీ ప్రభుత్వంలో ఆగిపోయిన కదిరి-ఎస్‌పీ కుంట రహదారిని రూ.24 కోట్లతో పూర్తి చేశాం. కోటి రూపాయల రోడ్డుకే గొప్పలు చెప్పుకుంటున్నావు..' అని విమర్శించారు. హంద్రీనీవా ఎన్టీఆర్ మానస పుత్రిక అని, దాన్ని పూర్తి చేసింది సీఎం చంద్రబాబు అని అన్నారు. తన లెక్సెస్ కారు గురించి ప్రకాష్ రెడ్డి ఇప్పుడు మాట్లాడుతున్నారని, 2009లోనే తనకు ఆ కారు ఉందని అన్నారు. కావాలంటే రిజిష్ట్రేషన్ సర్టిఫికెట్ పంపుతానని అన్నారు. కొవిడ్ సమయంలో ప్రతిపక్షంలో ఉన్నా పీపీ కిట్లు అందించామని, ప్రభుత్వం చేయలేని పని తాము చేసినందుకు కేసులు పెట్టలేదా అని ప్రశ్నించారు. తాను ఉంటానో పోతానో అని ప్రకాష్‌రెడ్డి బెదిరిస్తున్నారని, ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరని అన్నారు. 'దేశంలోనే అత్యధిక కేసులున్న మీ నాయకుడు జగన్ ఉంటాడో పోతాడోనన్న అనుమానం మీకు కలగలేదా?' అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టులో తనకు వ్యతిరేకంగా ఏ కేసు లేదని, ప్రకాష్‌రెడ్డి నోటికొచ్చినట్లు తలతిక్కగా మాట్లాడితే సరైన సమాధానం చెబుతామని అన్నారు. మర్యాదకు మర్యాదగా, అమర్యాదకు అమర్యాదగా సమాధానం చెబుతానని అన్నారు. 'నాకు ఓటు వేయకపోతే చచ్చిపోతా.. మీ కోసం ఆస్తులు అమ్ముకున్నా..' అని తానెప్పుడూ ప్రజలను అడుక్కోలేదని ఎద్దేవా చేశారు. నాయకుడిగా ఎదగాలంటే ప్రజలకు సేవ చేయాలని, అడుక్కోకూడదని అన్నారు. రాష్ట్రంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడం, సీఆర్‌డీఏ కార్యాలయాన్ని ప్రారంభించడం ఒకే రోజు జరగడం శుభకరమని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ రాజశేఖరాచారి, కౌన్సిలర్ రంగారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డైమెండ్ ఇర్ఫాన్, పార్టీ నాయకుడు ఇలాహీ పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయాలి

- బ్యాంకు యూనియన్ నేత రుష్యేంద్రబాబు



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బ్యాంకు యూనియన్ నేత రుష్యేంద్రబాబు.. కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రైవేటు బ్యాంకు యూనియన్ విభాగం పిలుపుమేరకు మంగళవారం సాయంత్రం స్థానిక సాయినగర్‌లోని కోటక్‌బ్యాంకు ఎదుట బ్యాంకు ఉద్యోగులు నిరసన చేపట్టారు. రుష్యేంద్రబాబు మాట్లాడుతూ.. ప్రైవేటు బ్యాంకు యజమాన్యాలు.. ఉద్యోగుల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నాయన్నారు. శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై కక్ష సాధింపులు మానుకోవాలనీ, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు మున్వర్ బాషా, రఘునాథ్‌రెడ్డి, శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శివానంద గుప్తా, శంకర్, భారతి పాల్గొన్నారు.

బస్సులు రాని ఊళ్లు

పదేళ్లుగా ఐదు గ్రామాలకు ఆర్టీసీ సేవలు బంద్

- ఆటో ప్రయాణాలతో గ్రామస్థుల అవస్థ



కమలాపురం-కొప్పలకొండ రోడ్డు

గార్లదిన్నె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు ఆర్టీసీ బస్సు సౌకర్యం కోసం ఎదురు చూస్తున్నాయి. కమలాపురం, కొట్టాలపల్లి, కేకే తండా, కేశవాపురం, కొప్పలకొండ గ్రామాలకు గతంలో బస్సు సౌకర్యం ఉండేది. దీని ద్వారా విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు పాఠశాలలు, ఇతర అవసరమైన పనులకు గార్లదిన్నె, అనంతపురం వంటి ప్రాంతాలకు వెళ్లేవారు. అయితే దాదాపు పదేళ్ల కిందట ఆగ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపేశారు. దీంతో ఆ ఐదు గ్రామాల ప్రజలు ఎక్కడి వెళ్లాలన్నా ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేని రోజుల్లోనే బస్సులు సక్రమంగా వచ్చేవని, ఇప్పుడు అన్నీ బాగున్నా ఒక్క బస్సు రావడం లేదని ఆయా గ్రామల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగుతుండటంతో భయం..భయంగా ఆటోలో ప్రయాణించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్నిమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్ల నుంచి రావడం లేదు



గార్లదిన్నె నుంచి కమలాపురం, కొట్టాలపల్లి, కేకే తండా, కేశవాపురం, కొప్పలకొండ గ్రామాలకు పదేళ్ల నుంచి బస్సులు రావడం లేదు. దీంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు సార్లు గ్రామాలకు బస్సులు వచ్చేవి. దీంతో 5 గ్రామాలకు చెందిన ప్రజలు సరుకులు, ఎరువులు, మందులు కొనుగోలు చేసేందుకు గార్లదిన్నె, అనంతపురం పట్టణాలకు బస్సులోనే వెళ్లేవారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలకు బస్సులోనే వెళ్లే వారు. ఇప్పుడు బస్సులు రాకపోవడంతో ఆటోలే దిక్కయ్యాయి. - అంజనేయులు, కేశవాపురం

బస్సు సౌకర్యం కల్పించాలి



ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. బస్సు సౌకర్యం లేక 5 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు బస్సులు రాకపోవడంతో ఆటోలలో ప్రయాణం చేస్తు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాల్సి ఉంది. - పెద్ద ఆదినారాయణ, కేశాపురం

పంటల బీమాలో
అక్రమాలపై చర్యలు

- అప్పటి జేడీఏ చంద్రానాయక్, మరో ముగ్గురు అధికారులపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ
- విచారణాధికారిగా ఏడీ విజయలక్ష్మి నియామకం
- నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం

అనంతపురం అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విడపనకల్లు మండలం డొనేకల్లు పరిధిలో 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి బీమా చెల్లింపులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అప్పటి జేడీఏ చంద్రానాయక్, మరో ముగ్గురు అధికారులపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను ప్రభుత్వం జారీ చేసింది. 2021 ఖరీఫ్‌లో డొనేకల్లు రైతులకు రూ.10.39 లక్షల పంటల బీమా సొమ్ము చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి జేడీఏ చంద్రానాయక్, ఉరవకొండ ఏడీఏ పద్మజ, ఏఓ మధుమతి, డొనేకల్లు వీఏఏ విజయభాస్కర్‌పై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను జారీ చేశారు. ఈ వ్యవహారంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్ అదనపు సంచాలకురాలు (ఏడీ) విజయలక్ష్మిని విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సహాయ విచారణ అధికారిగా ప్రస్తుత జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మను నియమించారు. నెల రోజుల్లోగా విచారణ పూర్తి చేసి, సమగ్ర నివేదికలు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఖాతా ఖాళీ చేసిన ఏపీకే ఫైల్

అనంతపురంరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మొబైల్‌కు వచ్చిన ఏపీకే ఫైల్‌ను టచ్ చేయగానే.. బ్యాంకు ఖాతాలోని సొమ్ము మాయమైంది. దీంతో మండలంలోని కురుగుంటకు చెందిన అశోక్‌కుమార్ బోరుమన్నాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తెలిసిన వ్యక్తి నంబరు నుంచి పీఎం కిసాన్ ఏపీకే ఫైల్ అశోక్‌కుమార్ ఫోన్‌కు వచ్చింది. పీఎం కిసాన్ జాబితా అనుకుని ఫైల్ ఓపెన్ చేశాడు. వెంటనే అతడి ఖాతాలకు ఓటీపీలు వచ్చాయి. రూ.15వేల చొప్పున నాలుగు సార్లు, రూ.4 వేలు, రూ.500 బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీ అయింది. ఒక్కసారిగా ఓటీపీలు రావడం, నగదు బదిలీ అవుతుండడంతో ఖాతాలోని సొమ్మును తెలిసినవారికి పంపే ప్రయత్నం చేశాడు. కొంతమేర బదిలీ చేయగలిగాడు. అప్పటికే రూ.64,500 మోసగాళ్లు కొట్టేశారు. విషయాన్ని బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా.. వారు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగాడు. మాయమైన సొమ్ము హ్యాకర్ల ఖాతాల్లోకి కాకుండా స్వైప్ కార్డులోకి జమ చేసుకున్నట్లు చెప్పుకొచ్చాడు.

మైనార్టీలు కర్తవ్యం తెలుసుకోవాలి

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా చిస్తి



ప్రసంగిస్తున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా చిస్తి

అనంతపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో మైనార్టీలు తమ కర్తవ్యాన్ని తెలుసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్లా చిస్తి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆవాజ్ జిల్లా కార్యదర్శి వలి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అమెరికా ఏక ధ్రువ ప్రపంచంగా ఉన్న పరిస్థితులకు భిన్నంగా షాంగై, బ్రిక్స్ కూటములు అంటూ బహుళ ధ్రువ ప్రపంచం వైపుగా అడుగులు వేస్తోందని, ఇది శుభ పరిణామమన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన మతోన్మాద ఎజెండాను అమలు చేయడంలో ఎక్కడా వెనక్కు తగ్గడం లేదన్నారు. దేశవ్యాప్తంగా మైనార్టీలపై వక్ఫ్ సవరణ చట్టం, హిజాబ్, హలాల్ అజాన్ నమాజ్ అంటూ దాడులు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ కలిసి పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రామిరెడ్డి, ఆవాజ్ నగరాధ్యక్షుడు మసూద్, ఇర్ఫాన్, గఫూర్, జీవ, హిస్మాయిల్, హాజీ లతీఫ్, గౌస్, చాంద్‌బాషా, ఫయాజ్, ఆజం తదితరులు పాల్గొన్నారు.

లగాన్ దందా..!

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రానైట్ అక్రమ వ్యాపారం జోరుగు సాగుతోంది. గనుల శాఖ పర్మిట్లు లేకుండా, పన్నుల శాఖకు జీఎస్టీ చెల్లించకుండా వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. ఈ అక్రమాలకు తాడిపత్రి కేంద్రంగా నిలుస్తోంది. గ్రానైట్ గుండ్లను పాలిషింగ్ చేసి, విక్రయిస్తుంటారు. ఇందులో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇక్కడ దశాబ్దాలుగా లగాన్ అనే ఓ ప్రత్యేక గ్యాంగ్ చక్రం తిప్పుతోంది. గతంలో ఇక్కడ 450 పైచిలుకు పరిశ్రమలు ఉండేవి. వాటి సంఖ్య ఇప్పుడు తగ్గిపోయింది. అక్రమాలు మాత్రం ఆగడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన గనుల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. జీఎస్టీ ఎగ్గొడుతున్నా పన్నుల శాఖ అధికారులు ఆమ్యామ్యాలతో సరిపెట్టుకుంటున్నారనే విమర్శలున్నాయి.

లగాన్ గ్యాంగ్ అక్రమాలు...

తాడిపత్రి పట్టణ పరిధిలో గతంలో అనేక గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమలుండేవి. దూర ప్రాంతాల నుంచి గ్రానైట్ గుండ్లను తీసుకొచ్చి, పాలిషింగ్ చేయించేవారు. నిర్వహణ భారంతో కొన్ని, నిబంధనలతో మరికొన్ని మూసివేశారు. ఇదివరకు 450 పాలిషింగ్ సెంటర్లు ఉండేవి. ప్రస్తుతం 60 నుంచి 70 మాత్రమే ఉన్నాయి. దశాబ్దాలుగా ఇక్కడ లగాన్ టీమ్ చక్రం తిప్పుతోంది. పర్మిట్లు తీసుకోకుండా, రాయల్టీ చెల్లించకుండా గ్రానైట్ గుండ్లను అక్రమంగా రవాణా చేయించడమే ఆ గ్యాంగ్ పని. ప్రకాశం జిల్లా కనిగిరి, అన్నమయ్య జిల్లా మదనపల్లి, కర్ణాటక రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, కదిరి ప్రాంతాల నుంచి గ్రానైట్ గుండ్లను తరలిస్తారు. స్థానికంగా క్రషింగ్ మిషన్లలో పాలిషింగ్ చేసి పంపిస్తారు. బ్లాక్, కలర్ గ్రానైట్‌లను ఎక్కువగా తరలిస్తుంటారు. గతంలో అక్రమాల కట్టడికి ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. లగాన్ టీం నిర్విరామంగా అక్రమాలకు పాల్పడుతూ... అధికారులకు ముడుపులు ముట్టజెబుతోంది. రోజూ ఇక్కడి నుంచి 25 నుంచి 30 వాహనాల్లో రవాణా చేస్తుంటారు. ఇక్కడమరో ప్రత్యేకత ఏంటంటే ఒక వాహనానికి పర్మిట్ తీసుకుని, పలుసార్లు రవాణా చేస్తుంటారు. గనులు, పన్నుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వారి అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదాయానికి గండి

గ్రానైట్ పాలిషింగ్ విషయంలో జీరో వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఒక్కో వాహనంలో ఒకట్రెండు గుండ్లు తీసుకొస్తారు. గ్రానైట్‌కు ఇదివరకు జీఎస్టీ 12శాతం చెల్లించాల్సి ఉండేది. జీఎస్టీ శ్లాబుల మార్పు నేపథ్యంలో 12శాతం నుంచి 5శాతానికి తగ్గించారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఇన్‌వాయిస్, వే బిల్లు లేకుండానే అక్రమంగా తరలిస్తున్నారు. ఇప్పుడు ప్రతి నెలా రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు జీఎస్టీ ఎగవేస్తున్నట్లు తెలుస్తోంది.

గనుల శాఖ ఆదాయం ఏదీ...?

ఇతర జిల్లాల నుంచి గ్రానైట్ గుండ్లను తీసుకొచ్చి ఇక్కడ పాలిషింగ్ చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారంలో గనుల శాఖ స్థానిక అధికారుల నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యూబిక్ మీటర్‌కు 5వేల పైచిలుకు చెల్లించాలి. 17టన్నుల గ్రానైట్ గుండుకు రూ.30వేలకుపైగా పర్మిట్ రూపంలో చెల్లించాలి. ఇదంతా ఎగ్గొడుతున్నారు. గనుల శాఖకు తాడిపత్రి పరిధి నుంచి వచ్చిన ఆదాయం చూస్తే అక్రమాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో తెలుస్తుంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి తాడిపత్రి పరిధిలో రూ.75కోట్లు లక్ష్యం విధించగా..రూ.41.50కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాదికి రూ.66కోట్లు లక్ష్యం కాగా.. సెప్టెంబరు 15 వరకు రూ.30.82 కోట్లు సమకూరింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

షిర్డీసాయిబాబా (మహా సమాధి)



'సబ్ కా మాలిక్ ఏక్ హై' అనే నినాదాన్ని చాటిన సాధువు, యోగి అయిన షిర్డీసాయిబాబా 1835 సెప్టెంబరు 23న జన్మించారు. భక్తులకు శ్రద్ధ, సబూరి లక్షణాలను అలవరుచుకోవాలని సూచించారు. రెండు మతాలను అవలంబించి సహయోగము కుదర్చడానికి ప్రయత్నించారు. ముస్లింలు, హిందువులు కూడా ఆయనను సాధువుగా నమ్ముతారు. తాను నివసించిన మసీదును ద్వారకామాయి అని పేరు పెట్టారు. ఆయన బోధనలో ప్రేమ, కరుణ, దానం, సంతృప్తి, శాంతి, దైవారాధన, గురుపూజ ముఖ్యమైనవి. భక్తులు ఆయనను శివుని, దత్తాత్రేయ అవతారంగా భావిస్తారు. 1918 అక్టోబరు 15న షిర్డీలో మహాసమాధి అయ్యారు.

దేవిప్రసాద్ రాయ్ చౌదరి (వర్ధంతి)



దేశంలో పేరొందిన ప్రముఖ చిత్రకారుడు, శిల్పి పద్మభూషణ్ గ్రహీత దేవిప్రసాద్ (డిపి)రాయ్ చౌదరి 1899 జూన్ 15న రంగపూర్‌లోని తేజ్‌హాత్‌లో (ప్రస్తుతం బంగ్లాదేశ్ పరిధిలో) జన్మించారు. చిత్రకళలో రాణించి దేశవ్యాప్తంగా కళాఖండాలను ప్రదర్శించారు. ప్రత్యేకించి మహాత్మా గాంధీ కాంస్య విగ్రహం, ఇతర ప్రముఖుల విగ్రహాల రూపకల్పనలో పేరొందారు. లలిత కళా అకాడమీ సంస్థాపక చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన కళాఖండాలు పలు మ్యూజియంలలోనూ ప్రదర్శించబడ్డాయి. 1975 అక్టోబరు 15న కన్నుమూశారు.

డాక్టర్ అబ్దుల్ కలాం (జయంతి)




దేశం గర్వించదగిన ప్రముఖులలో ఒకరైన 'భారతరత్న' గ్రహీత, దేశ 11వ రాష్ట్రపతిగా వ్యవహరించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 1931 అక్టోబరు 15న రామేశ్వరంలో జన్మించారు. డిఆర్‌డీఓ, ఇస్రోలలో శాస్త్రవేత్తగా పలు హోదాలలో కొనసాగి బాలిస్టిక్ మిస్సైల్, లాంచ్ వెహికల్ సాంకేతికతలో ఆధునీకరణకు కృషి చేసి 'మిస్సైల్ మ్యాన్'గా గుర్తింపు పొందారు. పోఖ్రాన్ అణు పరీక్షల్లోనూ కీలకంగా వ్యవహరించారు. 2002 నుంచి 2007 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. పద్మ భూషణ్, పద్మవిభూషణ్, వీర్‌సావర్కర్‌తోపాటు పలు గౌరవ డాక్టరేట్‌లు, ఇతర పురస్కారాలు పొందారు. 'కలలు కనండి సాకారంకై శ్రమించండి' అని విద్యార్థు లకు పిలుపునిచ్చారు. 2015 జూలై 27న కన్నుమూశారు.

కాటూరి వేంకటేశ్వరరావు (జయంతి)



రచయిత వేంకటేశ్వరరావు 1895 అక్టోబరు 15న కృష్ణా జిల్లా కాటూరిలో జన్మించారు. ఉపాధ్యాయుడిగా, కవిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. ఉప్పు సత్యాగ్రహంలోనూ పాల్గొన్నారు. పింగళి లక్ష్మీకాంతంతో కలసి కొన్ని రచనలు చేశారు. గురువులైన తిరుపతి వేంకటకవుల మాదిరిగా జంటకవులుగా ఆధునిక సాహిత్యానికి కృషి చేశారు. సంస్కృతం నుంచి కొన్ని అనువాదం చేశారు. 1962 డిసెంబరు 25న కన్నుమూశారు.

ముడికొండన్ వెంకటరామ అయ్యర్ (జయంతి)



సంగీత కళానిధి గ్రహీ కర్ణాటక సంగీతకారుడు ముడికొండన్ వెంకటరామ అయ్యర్ 1897 అక్టోబరు 15న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో ముడికొండన్ ప్రాంతంలో జన్మించారు. రాగం, తాళం, పల్లవిలను క్రమంగా చెప్పడంలో దిట్ట. తెలుగు, తమిళ, సంస్కృ తం, ఆంగ్ల భాషలలో ప్రావీణ్యులు. చెన్నైలోని టీచర్స్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌కు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిం చారు. సంగీత శిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 1975 సెప్టెంబరు 13న కన్నుమూశారు.

శంకర్ (జయంతి)



సంగీతద్వయం 'శంకర్ - జైకిషన్' లలో ఆయన ఒకరైన 'పద్మశ్రీ' గ్రహీత శంకర్‌సింగ్ 1922 అక్టోబరు 15న హైదరాబాద్‌లో జన్మించారు. తబలా, సితార్, అకార్డియన్, పియానో తదితర సంగీతవాద్యాలను వాయించేవారు. 1949 నుంచి 1971వరకు ఇద్దరూ కలసి హిందీ సినీ రంగంలో సంగీతాన్ని సమకూర్చారు. 9సార్లు ఉత్తమ సంగీతదర్శకుల అవార్డు పొందారు. రాజ్ కపూర్ ఫిల్మ్స్‌కు హౌస్ కంపోజర్స్‌గా వ్యవహరించారు. ఇరువురూ 'పద్మశ్రీ' పొందారు. 1987 ఏప్రిల్ 26న శంకర్ కన్నుమూశారు.

వెంపటి చినసత్యం (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత వెంపటి చినసత్యం 1929 అక్టోబరు 15న కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించారు. భరతనాట్యానికి దీటైన కూచిపూడి నృత్యానికి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిలో తెచ్చారు. 1963లో కూచిపూడి ఆర్ట్ అకాడమీని స్థాపించారు. కూచిపూడిలో నృత్య నాటికలను రూపొందించి దేశవిదేశాలలో ప్రదర్శించారు. 2011లో 2800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనకు గిన్నిస్ రికార్డు సాధించారు. కళాప్రపూర్ణ, కళాసాగర్, కళైమామణి, కాళిదాస సమ్మాన్ తదితర లెక్కకు మిక్కిలి పురస్కారాలు పొందారు. 2012 జూలై 29న కన్నుమూశారు.

ఎన్ రమణి (జయంతి)



వేణువాదకులు 'పద్మశ్రీ' గ్రహీత డాక్టర్ నటేశన్ రమణి 1934 అక్టోబరు 15న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో జన్మించారు. వేణువుపై కర్ణాటక సంగీతాన్ని సమకూర్చడం ప్రత్యేకత. ఆలిండియా రేడియోలో కచేరీలు నిర్వహించారు. జుగల్బందీలలోనూ రాణించారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. 2015 అక్టోబరు 9న కన్నుమూశారు.

వయోపరిమితిపై గందరగోళం

● ఒకటో తరగతి ప్రవేశానికి ఆరేళ్లు తప్పనిసరి అంటున్న విద్యాశాఖ ● ఆన్‌లైన్‌లో నమోదుకు ఇబ్బందులు..ఎటూ తేల్చని అధికారులు



బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తరగతిలో చేర్పించేందుకు వయో పరిమితి సడలింపు మరోసారి చర్చలకు కారణమవుతోంది. వయో పరిమితిని సడలిస్తూ విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తరగతిలో పిల్లలను చేర్పించే విషయంలో కొన్నేళ్లుగా గందరగోళమైన వివాదం ఉంది. గతంలో ఎల్‌కేజీ, యూకేజీలాంటివి లేవు. నేరుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్చేవారు. ప్రస్తుతం ఒకటో తరగతిలో చేరాలంటే రెండున్నరేళ్ల నుంచి మూడేళ్లపాటు ముందుగానే బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రి నర్సరీ క్లాసులు ఆరు నెలలనుంచి సంవత్సరంపాటు ఉంటాయి. ఆ తర్వాత ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేయాల్సి ఉంటుంది. రెండున్నరేళ్లకే నర్సరీలో వేసినా ఐదేళ్లు మాత్రమే ముగుస్తుంది. ప్రభుత్వం ఒకటో తరగతిలో చేరాలంటే జూన్ నెలనాటికి ఆరేళ్లు పూర్తిగా నిండాల్సి ఉంటుందని తీర్మానించింది. 2025-26 ప్రస్తుత విద్యాసంవత్సరంలోనే ఈ నిబంధన తీసుకురావాలని ప్రయత్నించారు. అయితే చివరిక్షణంలో తల్లిదండ్రులు ఈ ఏడాది మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం కూడా వెనుకడుగు వేసింది. ఒకటో తరగతిలో చేరే సమయానికి 5 సంవత్సరాల 5 నెలలు నిండితే సరిపోతుందని సవరించారు. పిల్లల పుట్టినతేదీ ఒకే విధంగా ఉండదు. నిబంధనలు అమలు చేస్తే ఆరేళ్లు పూర్తయ్యాక చేరినట్లు అవుతుంది. మరికొందరు ఐదున్నరేళ్లకే చేరినట్లు అవుతుంది. ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసి సగం రోజులైంది. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేందుకు మరో ఏడున్నర నెల ఉంది. ఇప్పటినుంచే స్పష్టమైన నిబంధనలు తీసుకురావాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇప్పటినుంచే ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరేళ్లు పూర్తైనవారినే ఒకటో తరగతిలో చేర్పించుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో ఒకటో తరగతిలో చేరే చిన్నారి వయసు 6 సంవత్సరాలు నిండి ఉండాలనే నిబంధనలు అమలు చేశారు.

2022లో అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని ప్రభుత్వం జాతీయ విద్యావిధానం, విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా ఒకటో తరగతిలో చేరాలంటే ఆరేళ్లు నిండి ఉండాలనే నిబంధన తప్పనిసరి చేశారు. 2025-26 వరకు ఈ నిబంధన అమలు కొనసాగింది. 2025-26 విద్యాసంవత్సరంలో కొత్త నిబంధనను అమలులోకి తీసుకొచ్చేందుకు సిద్దరామయ్య ప్రభుత్వం సిద్ధమైంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ని రాష్ట్రంలో రద్దు చేసి స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎస్ఈపీ)ని అమలులోకి తీసుకురాదలిచారు. వీటి ప్రకారం ఒకటో తరగతిలో చేరే పిల్లలకు ఆరేళ్లకు మూడు నెలలు అధికం లేదా తక్కువగా ఉన్నా చేర్చుకునేందుకు వెసలుబాటు కల్పించారు. ఈ నిబంధనను తల్లిదండ్రులు వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం గత విద్యాసంవత్సరంలో సడలించింది. కానీ రానున్న విద్యాసంవత్సరంలో ఆరేళ్ల నిబంధన తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు. దీన్నిబట్టి మూడు నెలల సడలింపునకు బ్రేక్ పెట్టాలనేది విద్యాశాఖ ఆలోచనగా ఉంది. అయితే స్టేట్ ఎడ్యుకేషన్ పాలసీలో ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారనేది స్పష్టత లేకుండా పోయింది. రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల పాలకమండలిల సమాఖ్య కార్యదర్శి శశికుమార్ అభిప్రాయం మేరకు ఆరేళ్లకు ఒకటో తరగతిలో చేర్చడం సరైన నిర్ణయమని, శాస్త్రీయంగాను అది నిర్ధారించబడిందన్నారు. అంతలోపు వయసు ఉన్న పిల్లలను బడిలో చేరిస్తే వారి మానసిక స్థిరత, స్వయం నియంత్రణ, సామాజికంగా నలుగురితో కలిసే పరిణామాలు తక్కువని, ప్రభుత్వం సముచితమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రంగుల దీపావళికి మార్కెట్లో సందడి



మల్లేశ్వరంలో దీపావళి కోసం దుకాణాల వద్ద ఇలా...



ఓ దుకాణంలో అలంకరణ సామగ్రి

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటే చిన్నారుల నుంచి వృద్ధుల దాకా ఎంతో ఇష్టపడతారు. దీపావళి పండుగన లక్ష్మీపూజ చేయడం, భవిష్యత్తులో అంతా మంచి జరగాలని కోరుకుంటారు. నరకాసురుడిని వధించిన తర్వాత సమాజంలో సంతోషం ఉండేలా సంప్రదాయంగా వచ్చిన దీపావళి టపాసులు కాల్చడం ద్వారా మరింత ఆనందం సాధ్యమవుతుంది. నగరంలో బాణాసంచా దుకాణాలు అప్పుడే తలెత్తాయి. వివిధ మైదానాలలో బాణాసంచా విక్రయాలకు వివిధశాఖలు అనుమతినిచ్చాయి. మరోవైపు పండుగవేళ ఇంటిని మరింత అందంగా తీర్చేందుకు అవసరమైన సామగ్రి మార్కెట్‌లోకి వచ్చింది. ఎటు చూసినా దీపావళికి అవసరమైన అందమైన వస్తువులు కళకళలాడుతున్నాయి. గాంధీబజార్, మల్లేశ్వరం, ఇందిరానగర్, కోరమంగల, యలహంక, కేఆర్ పురం, జయనగర్ తోపాటు పలు చోట్ల అందమైన వస్తువుల వ్యాపారాలు జోరందుకున్నాయి.

పాలనలో పారదర్శకతకు సాంకేతిక సమాచారమే కీలకం

● గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్



వేదికపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాలనలో అన్ని దశలలోనూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగినందున పారదర్శకత సాధ్యమైందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ అభిప్రాయపడ్డారు. సమాచార హక్కుచట్టం ఏర్పడి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా బెంగళూరులో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. సమాచార హక్కు ప్రక్రియలు సంపూర్ణంగా డిజిటలీకరణ చేయడం ద్వారా పారదర్శకత సాధ్యమైందన్నారు. సమాచార చట్టం కొన్ని సవాళ్లు ఎదుర్కొంటోందని అభిప్రాయపడ్డారు. చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేసుకుని కార్యా లయాలపై దాడి తరహాలో వ్యవహరిస్తున్నారన్నారు. సమాచారచట్టం శక్తిని అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడికి పరిణామకారి కావాలని చట్టం తీసుకొచ్చారన్నారు. ప్రజాప్రభుత్వానికి నిజమైన శక్తి ప్రజలను చైతన్యం చేయడమే అన్నారు. రానున్నరోజుల్లో సమాచార హక్కుచట్టం మరింత బలో పేతం కావాలన్నారు. కార్యక్రమానికి బీడీఏ చైర్మన్ ఎన్ఏ హారిస్, సమాచార కమిషనర్లు కే రామన్, ఎస్ రాజశేఖర్, రుద్రణ్ణ హట్టికోటి, బద్రుద్దీన్, నారాయణ జీ చెన్నాళ్, డాక్టర్ బీఆర్ మమత, కమిషన్ సెక్రటరీ సుస్మగోడబోళె తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ ట్రాఫికింగ్‌పై కఠినచర్యలు తప్పనిసరి

కేంద్రమంత్రి సోమణ్ణ



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కేంద్రమంత్రి

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమెన్ ట్రాఫికింగ్‌పై మరింత కఠినమైన చట్టాలు అవసరమని కేంద్రమంత్రి సోమణ్ణ అభిప్రాయపడ్డారు. మంగళవారం నగరంలో మహిళా భద్రత అంశంపై ప్రత్యేక సభ జరిగింది. జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ విజయ రహత్కర్, సభ్యులు సుదీప్‌జైన్, డెలీనా బోంగ్దప్, మమతాకుమార్, డాక్టర్ అర్చనా మజుందార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, మహిళలకు భద్రత విషయంలో కల్పించిన సౌలభ్యాలను వివరించారు. అనంతరం డీజీపీ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం జరిపారు. డీజీపీ సలీం అహ్మద్, నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ సహా ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

1న తిరుమలకు పాదయాత్ర

మడకశిరటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణం నుంచి తిరుమల తిరుపతికి పాదయాత్రగా నవంబరు 1వతేదీన బయలుదేరి వెళ్లనున్నట్లు పాదయాత్ర బృందం ఆర్గనైజర్ సతీష్‌బాబు, చిక్కణ్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది కార్తీకమాసం శుక్లపక్షం ఏకాదశి రోజున కలియుగ ప్రత్యక్ష దైవమైన వెంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన వెళ్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాదయాత్రలో పాల్గొని ఏడుకొండల స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

17న కోలారు బంద్‌కు పిలుపు



కరపత్రాలతో దళితసంఘాల సభ్యులు

బంగారపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది షూ విసిరిన ఘటన ప్రజాస్వామ్య ప్రభుత్వానికి అగౌరవం కల్పించేలా ఉందని దీన్ని ఖండిస్తూ ఈనెల 17న కోలారు జిల్లా బంద్‌కు పిలుపు ఇస్తున్నట్టు దళిత సంఘాల సమాఖ్య ప్రకటించింది. మంగళవారం పట్టణంలోని కోలారు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం దళిత నేత సూలికుంటె రమేశ్ మీడియాతో మాట్లాడారు. సనాతన ధర్మం పేరిట వెనుకబడిన, మైనారిటీవర్గాలపై దౌర్జన్యాలు సాగుతున్నాయని రోటపించారు. తమిళనాడు దళితుడికి ఆర్ఎస్ఎస్ కార్యకర్త మానసికంగా వేధించి హతమార్చారని, న్యాయమూర్తిపై షూ విసిరే యత్నం వంటివి ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల సందర్భంగా మనుస్మృతిని మళ్లీ అమలు చేసే కుట్ర సాగుతోందని ఆరోపించారు. ఈనెల 17న మధ్యాహ్నం 3 గంటలకు బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు. కరపత్రాలు పంపిణీ చేసి స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హుణసనహళ్ళి వెంకటేశ్, మదివణ్ణన్, కదిరేనహళ్ళి కుమార్, ముబారక్, సీపీఎం శ్రీనివాస్, ప్రభావతి, లక్ష్మమ్మ, శాంతమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. బస్టాండు సమీపంలో పడి ఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. అయితే మృతిచెందిన వ్యక్తి ఎవరనేది గుర్తించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిగదిలో భద్రపరిచారు. ఎవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు.



వ్యక్తి మృతదేహం

విద్యతోపాటు సాంకేతికత తప్పనిసరి

● విద్యార్థులకు వక్తల పిలుపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ రహత్కర్

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ పడాలంటే సాధారణ విద్యతోపాటు సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాల్సి ఉందని వక్తలు పేర్కొన్నారు. క్రైస్ట్ యూని వర్సిటీలో ఏ పరిజ్ఞానం - డిజిటల్ సురక్షితపై యశోదా ఏఐ అనే అంశా లపై ప్రత్యేక సదస్సు జరిగింది. జాతీయ మహిళా కమిషన్ తన ప్రముఖ కార్యక్రమమైన యశోదా ఏఐలో భాగంగా లా కళాశాలలో ప్రత్యేక చర్చాగోష్టి నిర్వహించింది. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ తదితరులు భాగస్వామ్యులయ్యారు. విద్య, వృత్తిపరమైన జీవనంలో ఏఐ ప్రభావం అనే అంశంపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. విద్య, లా, వ్యవహారాలకు సంబంధించి ఏఐ ప్రాధాన్యతను వివరించారు.

ఆత్మహత్యకు యత్నించిన టైలర్..

రాయదుర్గం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శనేశ్వారస్వామి దేవాలయం వద్ద నివాసముండే టైలర్ వడ్డే సురేష్ (43) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ఈ నెల 11న మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కుటుంబ సభ్యులతో అతను గొడవపడ్డాడు. జీవితంపై విరక్తిచెందిన అతను మూర్ఛవ్యాధి మాత్రలను ఎక్కువగా మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బళ్లారి విమ్స్‌కు తరలించారు. కోలుకోలేక అతను మంగళవారం మరణించాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు రాయదుర్గం ఆర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు.

తండ్రి మందలించాడని.. కళాశాల భవనం నుంచి దూకి ఆత్మహత్య



ఆర్యన్ (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని ఆగ్రహానికి లోనైన పీయూ విద్యార్థి ఆర్యన్ మోసెస్ వ్యాస్ (17) కళాశాల భవనం నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళ వారం ప్రార్థనల సమయంలో కళాశాల రెండో అంతస్తు నుంచి దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆర్యన్‌ను సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. పులకేశి నగర్‌లో విద్యార్థి ఉంటున్నాడు. ఇదే ప్రాంతంలోని ఓ కళాశాలలో చదువుతున్నాడు. స్విమ్మింగ్‌లో ప్రతిభావంతుడిగా పేరొందాడు. తండ్రి స్విమ్మింగ్‌లో ప్రోత్సహించాడు. ఇటీవల స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు ఆర్యన్ వెనుకడుగు వేస్తుండడంతో మందలించిన మేరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పులకేశినగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కార్కళ మాజీ ఎమ్మెల్యే కుమారుడి ఆత్మహత్య



సుదీప్ భండారి (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కార్కళ మాజీ ఎమ్మెల్యే గోపాల్‌భండారి కుమారుడు సుదీప్ భండారి (48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఉడుపి జిల్లా బ్రహ్మావర బార్కురిలో మంగళవారం రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుదీప్ హెబ్రి అనే ప్రాంతంలో వైన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అతడికి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. బ్రహ్మావర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిల ఆత్మహత్య



శిరీష (ఫైల్)

శిడ్లఘట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దిబ్బూరహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామలింగాపుర గ్రామంలో క్రిమిసంహార మాత్రలు మింగి వివాహిత శిరీషా (22) ఆత్మ హత్యకు పాల్పడింది. అత్తమామల వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. రామ లింగాపుర గ్రామానికి చెందిన శ్రీనాథ్‌ను ప్రేమించి ఏడాదిక్రితం పెళ్లి చేసుకున్నారు. అమ్మాయి వేరే కులం అంటూ శ్రీనాథ్ కుటుంబీకులు అభ్యంతరం చెప్పారు. అప్పటి నుంచి ఏదో ఒకరకంగా కట్నం ఇతరత్రా పేర్లతో అత్తింటివారు వేధించేవారని తెలుస్తోంది. చివరకు వేధింపులు భరించలేక సోమవారం క్రిమిసంహారక మందులు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. శిరీషా కుటుం బీకులు దిబ్బూరహళ్ళి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శాస్త్రీయ సంగీతానికి సామా ఫౌండేషన్ సహకారం

బెంగళూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ సంగీత సాధకులకు సత్కరించడంతోపాటు ప్రత్యేక చర్చాగోష్టులు, నిర్వహించడం ద్వారా సామా ఫౌండేషన్ యువతరానికి చైతన్యం కలిగిస్తోంది. డాక్టర్ సుజాతతోపాటు కుటుంబ సభ్యులు శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహించేందు కోసం ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. రెండురోజులక్రితం యలహంకలో ప్రత్యేక సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసి రిటైరైన ఫణీంద్రతోపాటు పలువురు కళాకారులను సత్కరించారు. యువబృందం శ్రీహరిభట్, శ్రీవిద్య దావులూరి, బీజే శ్రీనివాస్‌ల కచేరి ప్రత్యేక ఆకర్షణ అనిపించింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	13,326	82,324
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,865	82,324
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.66

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

● సివిల్ కోర్టు న్యాయాధికారి శాంతి



బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలోని సివిల్ కోర్టులో తాత్కాలిక ప్రాతిపదికన పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెషన్స్ న్యాయాధికారి న్యాయ సేవ అథారిటీ చైర్మన్ శాంతి సూచించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆమె లీగల్ ఎయిడ్ గార్డియన్ 1, ఆఫీసు అసిస్టెంట్ 1పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తామన్నారు. డిప్యూటీ లీగల్ గార్డియన్ నెలవారీ జీతం రూ. 45 వేలు, ఆఫీసు అసిస్టెంట్ జీతం రూ. 19,695 చెల్లిస్తారన్నారు. ఇది సంచిత వేతనం . ఈనియామకాలు తాత్కాలికమైనవని, ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే నియామకాన్ని రద్దు చేసే హక్కు అథారిటీకి ఉందన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను పొంది నింపి, ఇటీవలి 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, బళ్లారి కార్యాలయంలో అందజేయాలన్నారు. చివరి తేది అక్టోబర్ 25 అన్నారు.

సీపీఆర్‌తో విలువైన ప్రాణాలు కాపాడవచ్చు

● రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి షకీబ్

బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీపీఆర్(కార్డిపల్మరీ చికిత్స) తో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి షకీబ్ అన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ , జిల్లావిద్యా సంస్థ, రేడియోపార్కు డైట్ కళాశాల సహకారంతో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షకీబ్ మాట్లాడుతూ ఇటీవలి రోజుల్లో గుండెపోటు కారణంగా మరణాల సంఖ్య వేగంగా పెరగుతోందని, సాధారణ ప్రజలకు కూడా ఈగుండెపోటు తప్పడం లేదన్నారు. తరచూ పలువురు చాతి నొప్పితో బాధ పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితిల్లో వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించే ముందు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనంతరం సీపీఆర్ చేసే విధానాన్ని బొమ్మల ద్వారా చేసి చూపించారు. ఈసందర్భంగా డైట్ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ తిప్పేస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న షకీబ్, విద్యార్థులు

ఐదేళ్ల నాటి సైబర్ మోసం కేసు సుఖాంతం

రాయచూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల నాడు పోగొట్టుకున్న సొమ్ము బాధితుడి చెంతకు చేరింది. 2020లో జరిగిన సైబర్ మోసం కేసులో నిందితుల నుంచి రాయచూరు జిల్లా పోలీసులు, సెన్ పోలీసులు రూ.18,29,425 స్వాధీనం చేసుకుని బుధవారం బాధితులకు అప్పగించారు. బాధితులు రాయచూరు నగరంలోని విద్యానగర్‌కు చెందిన లక్ష్మీకాంత్, అతని సోదరులు ట్రేడ్ ఎండీఎఫ్ఎస్ అనే కంపెనీ నుంచి లింక్ ద్వారా డబ్బు పెట్టుబడి పెట్టి డివిడెంట్‌లను పొందవచ్చని ఫేస్‌బుక్‌లో వచ్చిన ఒక ప్రకటన పై లక్ష్మీకాంత్ క్లిక్ చేశారు. ఆ తర్వాత, వారు ఆగస్టు 7, 2020 నుంచి ఆగస్టు 7, 2021 వరకు దశలవారీగా రూ.58,57,450 పెట్టుబడి పెట్టారు. అయితే, చాలా నెలలుగా డివిడెండ్ అందకపోవడంతో వారికి అనుమానం వచ్చి తాము మోసపోయామని గ్రహించి అక్టోబర్ 10, 2021న రాయచూరు సెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐదు సంవత్సరాల తర్వాత, పోలీసులు నిందితుడిని గుర్తించి, వారికి చెందిన వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ.18.29 లక్షలు రికవరీ చేసి బాధితుడు లక్ష్మీకాంత్‌కు తిరిగి ఇచ్చామని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. నిందితుడు తమిళనాడు రాష్ట్రంలోని రామనాథపురం జిల్లాకు చెందిన బుతురుస్మాన్‌గా గుర్తించామన్నారు. సైబర్ క్రైమ్ స్టేషన్ డీఎస్పీ వెంకటేశ్ హొగిబండి, అసిస్టెంట్ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ రాజప్ప బృందాన్ని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య అభినందించారు.



బాధితుడికి నగదు అప్పగిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

రాణి చెన్నమ్మ ఖ్యాతిని చాటిచెప్పాలి

● జయంతిని ఘనంగా నిర్వహించాలి

● ముందస్తు సమావేశంలో ఏడీసీ జుబేర్



ముందస్తు సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న కిత్తూరురాణి చెన్నమ్మ జయంతిని అర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వాన్ వీడియో హాల్లో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 23న నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని కల్చరల్ కాంప్లెక్స్‌లో వేదిక కార్యక్రమం జరగుతుందని అధికారులు అన్ని సంస్థల నాయకులు , ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మున్సిపల్ కళాశాల మైదానం నుంచి వేదిక వరకు ఊరేగింపు జరగనుందని, చెన్నమ్మ ఖ్యాతిని చాటి చెప్పేలా ప్లకార్డులు తయారు చేయాలన్నారు. ఊరేగింపులో సాంస్కృతిక కళాబృందాలు పాల్గొని చెన్నమ్మ ఖ్యాతిని ప్రదర్శించాలన్నారు. గొప్పవ్యక్తుల బోధనలు, ఆలోచనలను తదుపరి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు, పాఠశాల , కళాశాల పిల్లలు చెన్నమ్మ, ప్రజలు జిల్లాస్థాయి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈసమావేశంలో కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజుతో పాటు వివిధ జిల్లాస్థాయి శాఖల అధికారులు , వివిధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రూ. 52 లక్షల వ్యయంతో రారావి గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజ భూమి పూజ చేశారు. మంగళవారం తాలుకా లోని రారావి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజలు చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కళ్యాణ కర్ణాటక నిధులు కూడా ఈ పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ ఏఈ రంగప్ప, పీడీవో షాకీర్‌సాబ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, రారావి గ్రామ ప్రముఖులు యల్లప్ప, ఈరణ్ణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు ఉత్తమ విద్య అందించండి

● తల్లిదండ్రులకు వైద్యురాలు అమీనా సూచన



మాట్లాడుతున్న డాక్టర్ అమీనా

సిరుగుప్ప, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పిల్లలను చక్కగా చదివించి ఉత్తమ మహిళగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు డాక్టర్ అమీనా పిలుపునిచ్చారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మహిళ చిన్నారుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమీనా మాట్లాడుతూ నేటి రోజుల్లో దేశం అభివృద్ధి చెందాలంటే చిన్నారులు విద్యతో పాటు ఆర్థిక, రాజకీయ ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన శిబిరం

హోసూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు ఆర్‌వీ ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాలలో పాఠశాల ప్రాంగణ పరిశుభ్రతపై అవగాహన, పర్యావరణ పరిరక్షణపై అవగాహన శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వళర్మతి అధ్యక్షత వహించారు. పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి, కార్పొరేషన్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్ హాజరై ప్రసంగించారు. సాధ్యమైన మేరకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడరాదన్నారు. అలాగే అవసరమైన మేరకు బట్టసంచులు వినియోగించాలన్నారు. చుట్టుపక్కల ప్రదేశాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సూచించారు. హోసూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలన్నారు. అందరికీ పసుపు సంచులు పంపిణీ చేశారు. కార్పొరేషన్ పౌర కార్మికులతో కలసి పాఠశాల మైదానాన్ని శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాన్ని దూరం పెట్టినట్టేనన్నారు. కార్పొరేషన్ హెల్ ఇన్స్పెక్టర్ ఉదయకుమార్, హోసూరు జిల్లా ఎన్విరాన్‌మెంటల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, పాఠశాల డిప్యూటీ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైస్ ప్రెసిడెంట్ శక్తివేల్, ఉపాధ్యాయుడు పెరుమాళ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

కంప్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామానికి చెందిన హమాలీ జెడప్ప సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఏపీఎంసీ అధ్యక్షుడు హబీబుర్ రెహమాన్, ఏపీఎంసీ శాఖ మృతి చెందిన జడెప్పకి అంత్యక్రియల కోసం రూ. 25 వేలు చెక్కును ఎమ్మెల్యే జేఎన్ గణేష్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం ద్వారా రూ. ఐదు లక్షలు సహాయధనం అందిస్తామన్నారు. తద్వారా హమాలీ ముద్ర ఉన్న హమాలీలకు ఏపీఎంసీ ఎప్పుడూ అండగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, దొడ్డ బసప్ప, హనుమంతప్ప, ఈశప్ప, సుకృత స్వామి, హనుమంతు, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



జడెప్ప కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేశ్

హోసూరు జోన్



సమావేశంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, విద్యాశాఖ అధికారులు

విద్యాశాఖపై కలెక్టర్ సమీక్ష

హోసూరు (కృష్ణగిరి), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో విద్యాశాఖ సమీక్షా సమావేశానికి కలెక్టర్ దినేశ్‌కుమార్ అధ్యక్షత వహించారు. మంగళవారం ఏర్పాటైన సమావేశంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను వివరించారు. గత విద్యా సంవత్సరంలో 12వ తరగతి ఉత్తీర్ణులై ఉన్నత విద్యలో చేరిన విద్యార్థుల వివరాలు, ఇంకా ప్రవేశం పొందని విద్యార్థుల వివరాలను వేర్వేరుగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులను ఐటీఐ, డిఫార్మసీ, మెడికల్ వంటి కళాశాలల్లో చేర్పుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ఆధార్ నెంబర్లు లేని విద్యార్థులు, ఆధార్ కార్డును పొందడానికి సమీపంలోని ఆధార్ కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. పుదుమైపెణ్ వంటి పథకాలలోని విద్యార్థుల వివరాలను వెంటనే తనిఖీ చేయాలని, దివ్యాంగుల పిల్లలకు యూడిఐడి, ఎన్ఐడి బ్యాంకు ఖాతాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన పరికరాలను అందించేలా సంబంధిత శాఖ అధికారి చొరవ చూపాలన్నారు. 6-9 తరగతి వరకు విద్యార్థులకు అభ్యాసాన్ని అలవాటు చేయాలని తమిళం, ఆంగ్లం, గణితం వంటి సబ్జెక్టులలో వారికి మంచి ప్రావీణ్యం కల్పించాలని ఉపాధ్యయులకు సూచించారు. విద్యార్థులను నైపుణ్యంవంతులుగా మార్చడానికి స్మార్ట్ తరగతి గదులు, ల్యాబ్‌లను కూడా సరిగ్గా ఉపయోగించాలి అని తెలిపారు. ఇంకా ఇంటర్నెట్ సదుపాయం లేని పాఠశాలలను సంబంధిత శాఖ అధికారులు త్వరలో తనిఖీ చేసి వెంటనే ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలను వెంటనే నమోదు చేయాలని పాఠశాల నిర్వహణ కమిటీ నిర్ణయించింది. సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారి మునిరాజ్, గోపాలప్ప, రమాదేవి, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి మహేంద్రన్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని గ్రానైట్ లారీల సీజ్



స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీ

హోసూరు(క్రైం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు శూలగిరి సమీపాన సరైన అనుమతులు లేకుండా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న 2 ట్రక్కులను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. తియగరసనపల్లి ప్రాంతంలో శూలగిరి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరన్, గ్రామ పరిపాలనా అధికారి భాగ్యరాజ్ గస్తీ తిరుగుతుండగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న ట్రక్కులను పరిశీలించారు. దీంతో అనుమతి లేకుండా సాగిస్తున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ప్రయత్నంలో లారీ డ్రైవర్లు పరారైయ్యారు. శూలగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రూ.47 లక్షలతో తారురోడ్డు పనులకు శ్రీకారం

హోసూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు నియోజకవర్గంలోని కొత్త కొండపల్లి పంచాయతీ యూనియన్ అత్తిపల్లి - రాయకోట్టై రోడ్డు నుంచి తిరుపతి వేలి వరకు సుమారు రూ.47లక్షలతో తారురోడ్డు నిర్మించనున్నారు. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ ఇన్‌ఛార్జ్ రామూర్తి, పంచాయతీ మాజీ అధ్యక్షుడు మునిరాజ్, అశోక్‌కుమార్, బ్రాంచ్ సెక్రటరీ నారాయణప్ప, లే అవుట్ నిర్వాహకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్

26న చలో బెంగళూరు

● విద్యుత్తు ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన

● కర్ణాటక విద్యుత్తు వినియోగదారుల సంఘం రాష్ట్రకార్యదర్శి జ్ఞానమూర్తి

బళ్లారి సిటీ/రూరల్ అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించబోతున్నాయని, అలా చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని కర్ణాటక విద్యుత్తు వినియోగదారుల సంఘం రాష్ట్రకార్యదర్శి జ్ఞానమూర్తి హెచ్చరించారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ధరలను పెంచడం , స్లాబ్ పేరు తో సామాన్యులను వేధించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. విద్యుత్తు ఉద్యోగులకు గ్రాట్యుటీ, పెన్షన్ చెల్లించాల్సిన బాధ్యత నుంచి కూడా తప్పించుకుని యూనిట్‌కు రూ. 36 వసూలు చేయడం ద్వారా వినియోగదారులపై భారం మోపారన్నారు. స్మార్ట్‌మీటరు ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో వినియోగంలో తేడా లేనప్పటికీ విద్యుత్ బిల్లులు పెరిగాయన్నారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్ల కోసం డిపాటిట్ డబ్బు, నిర్వహణ సేవ మొదలైన వాటి యొక్క అధిక ఆర్థిక భారాన్ని వినియోగదారులు భరించాల్సి ఉంటుంది. ఉచిత చెల్లింపు డబ్బు అయిపోయిన వెంటనే విద్యుత్ నిలిపివేయడంతో వినియోగదారులు వివిధ సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కస్టమర్ అనుమతి లేకుండా మీటర్లను ఇన్‌స్టాల్ చేయడం వల్ల కస్టమర్ సమాచారం దుర్వినియాగం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా బలమైన ఉదయమాన్ని తక్షణ అవసరం అందువల్ల ఈవిషయంలో పోరాటం యొక్క తదుపరి రూపురేఖలను రూపొందించడానికి ఏఐఈసీఏ కి అనుబంధంగా ఉన్న కర్ణాటక విద్యుత్తు వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో 26న బెంగళూరులోని గాంధీ భవనం వద్ద నిరసన చేపడ్తామన్నారు. ఉద్యమానికి కార్మికులు, రైతులు, యువత, చిన్న వ్యాపారులు, కదిలి రావాలన్నారు. ఈసందర్భంగా కర్ణాటక విద్యుత్ వినియోగదారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సోమశేఖర్‌గౌడ, జిల్లా ఆర్గనైజర్ గురల్లిరాజా పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జ్ఞానమూర్తి

రాజ్యాంగ పోరాట కమిటీ ఆందోళన



ర్యాలీగా వెళ్తున్న రాజ్యాంగ రక్షణ పోరాట కమిటీ నాయకులు

రాయచూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి పై న్యాయవాది కిశోర్ దాడి చేయడాన్ని నిరసిస్తూ సింధనూరు రాజ్యాంగ రక్షణ పోరాట కమిటీ నాయకులు ఆందోళన చేపట్టారు. న్యాయవాది ప్రవర్తనను నిరసిస్తూ మంగళవారం సింధనూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఏపీఎంసీ గణేష్ గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రదర్శన బసవసర్కిల్, గాంధీ సర్కిల్, మీదుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బహిరంగ సమావేశ వేదికకు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన రాజ్యాంగ రక్షణ పోరాట కమిటీ నాయకులు, ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని రాజ్యాంగంపైన న్యాయ వ్యవస్థపైన జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. ఘటనను హోం మంత్రి ఖండించకపోవడం దీనిపై రాష్ట్రపతి సహితం స్పందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా దాడికి బాధ్యుడైన న్యాయవాది ఇప్పటివరకు కనీసం పశ్చాతాపం కూడ ప్రకటించకపోవడాన్ని తప్పుబట్టిన నిరసనకారులు ఆయన పై తక్షణం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రక్షణ పోరాట కమిటీ నాయకులు చంద్రశేఖర్ గొరబాళ, డీహెచ్ కంబళి, డీహెచ్ పూజార్, ఎస్ఏ ఖాదర్ సుభాని, బాబర్ పాషా అడ్వకేట్, కే జిలాని పాషా, హెచ్ఎన్ బడిగేర్, కరేగౌడ కురుకుంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే ఎలక్ట్రానిక్స్‌లో దీపావళి బంపర్ ఆఫర్స్

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గృహోపకరణ వస్తువులపై 28శాతం నుంచి 18శాతం వరకు జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో ఆర్‌కే ఎలక్ట్రానిక్స్‌లో సామాన్య ప్రజలకు సరసమైన ధరల్లో గృహోపకరణాలు అందించనున్నారు. వివిధ బ్రాండ్లకు సంబంధించి ఫ్రిడ్జ్‌లు, మొబైల్ ఫోన్‌లు దీపావళి పండుగ సందర్భంగా భారీగా తగ్గింపు ధరలో నగరంలోని అందజేస్తున్నట్లు ఆర్.కె. ఎలక్ట్రానిక్స్ నిర్వాహకులు రవికాంత్, శ్రీకాంత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునిక కాలానికి తగ్గట్టుగా అధునాతన పరిజ్ఞానంతో కూడి గృహోపకరణ వస్తువుల ధరలు తగ్గించి అందించడానికి ఆర్‌కే ఎలక్ట్రానిక్ సిద్ధంగా ఉందన్నారు. దీపావళి పండుగకు మరింత ఉత్సాహంగా జరుపుకోవడానికి ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా మార్కెట్‌లో లభించే అన్ని బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఒకేసారి డబ్బుచెల్లించి కొనలేని వారికి కూడా సులభ వాయిదాలు, సున్నా వడ్డీతో వస్తువులను కొనుగోలు చేసేందుకు బజాజ్, హెచ్‌డీఎఫ్‌సీ, టీవీ క్రెడిట్, ఐడీఎఫ్‌సీ తదితర ఫైనాన్స్ సహకారంతో సంస్థలు ఆర్.కె.ఎలక్ట్రానిక్స్ ద్వారా కొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చుసుకుని దీపావళి పండుగ వేళను మరింత కాంతివంతగా చేసుకోవాలని ఆయన కోరారు. దీంతో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోలు చేసే వారికి 25శాతం వరకు ఇన్‌స్టాట్ క్యాష్ బ్యాంకు అందిస్తున్నట్లు, మెగా ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, బంపర్ లక్కీ డిప్ ద్వారా ఈ-మోటారు సైకిల్, వాషింగ్ మిషన్ ఫ్రిడ్జ్, ఎల్ఈడీ టీవీ, మైక్రోవేవ్, మిక్సీలు, ఇన్‌స్టంట్ స్టౌవ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు.



నగరంలోని ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ షోరూం